క్లుప్తంగా

మల్లవరంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని మల్లవరంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రామాలయం ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అచ్యుతాపురం మండల సర్వసభ్య సమావేశం నేడు

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

28న జాబ్‌మేళా

పాయకరావుపేట: స్థానిక స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళా ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. 50 కంపెనీల్లో 1000 ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



నాగులాపల్లి మేలుకొలుపులో భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో మేలుకొలుపు కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి పలువురు భక్తులు చన్నీటి స్నానమాచరించి గ్రామంలోని ఆలయాల్లో దేవతామూర్తులను నిద్రలేపుతూ భజనలు చేశారు. ధనుర్మాసంలో భాగంగా నెలరోజుల పాటు మేలుకొలుపుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సభ్యులు కర్రి వాసు తెలిపారు. భజనలు చేస్తూ గీతాలు ఆలపిస్తూ గ్రామంలో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి మేలుకొలుపు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలు లక్ష్మి మృతికి సంతాపం



బోయిన లక్ష్మి(ఫైల్)

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళా నాయకురాలు బోయిన లక్ష్మి(66) బుధవారం ఇంటి వద్ద గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల క్రితం తిరుపతి వెళ్లి వచ్చిన లక్ష్మి మంగళవారం అర్ధరాత్రి అస్వస్థతకు గురయ్యారు. అనంతరం నిద్రించిన ఆమె ఉదయం లేచి చూసేసరికి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు గుర్తించారు. గతంలోనే ఆమె గుండె పోటుకు గురై శస్త్రచికిత్స కూడా చేయించుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే లక్ష్మి మృతికి వైఎస్సార్‌సీపీ నాయకుడు కొణతాల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు శానాపతి రాము, పార్టీ నాయకుడు వీసం వెంకటరమణ, తదితరులు సంతాపం తెలిపారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్సీ పద్మశ్రీకి వినతి పత్రం అందిస్తున్న మత్స్యకారులు

పాయకరావుపేట: మత్స్యకారుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీకి వినతి పత్రం అందించినట్లు రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాస్ తెలిపారు. మత్స్యకార భరోసా రూ.20 వేలు తక్షణం జమ చేయాలన్నారు. మండలంలోని వెంకటనగరం గ్రామానికి మినీ జెట్టీ నిర్మించాలన్నారు. బోట్లు, ఇంజిన్లు, వలలు, డీజిల్‌పై రాయితీ ఇవ్వాలన్నారు. తీర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో సాగు కోసం నిరుపేద మత్స్యకారులకు అనుమతులు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో స్థానిక మత్స్యకారులు సిరిపిల్లి శ్రీను, సూరాడ కోటి, అర్జుల్లి చిట్టిబాబు, ఎరిపిల్లి ఎల్లారావు, పెద కాపు ఈశ్వరరావు, తదితరులు ఉన్నారు.



యలమంచిలి మండలం రేగుపాలెం చర్చిలో చిన్నారుల సందడి



కొండకర్ల చర్చిలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు



పట్టణంలోని జేసీపీఎఫ్ చర్చిలో మత ప్రచారకులు, ఫాదర్లు



అరట్లకోట చర్చిలో డాన్స్‌లు చేస్తున్న యువకులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



గంగాదేవిపేటలో క్రిస్మస్ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



వెంకటాపురంలో చర్చి పాస్టర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ సభ్యులు



కొరుప్రోలు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంఘ కాపరులు



యలమంచిలి ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు చర్చిలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్ అగస్టీన్ రాజు



కోటవురట్ల కేకేబీ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



యలమంచిలి రోమన్ కేథలిక్ చర్చిలో బాలయేసు జనన వృత్తాంతం ప్రదర్శన



నక్కపల్లి చర్చిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ



వాడనర్సాపురంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాస్టర్ సుదర్శన, కొవిరి రామకృష్ణ

యలమంచిలి రూరల్: క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రార్థనా మందిరాలు క్రైస్తవ భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన వేడుకలు బుధవారం రాత్రి వరకు కొనసాగాయి. బుధవారం పట్టణంలోని పురాతన ప్రార్థనా మందిరాలైన కాకివానివీధి ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు చర్చి, బైపాస్ రోడ్డు రోమన్ కేథలిక్ చర్చిల్లో వందలాది మంది ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు, మత పెద్దలు కేక్ కట్ చేశారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఉదయాన్నే స్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా చర్చిలకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ భక్తులకు పాస్టర్లు ఏసయ్య జన్మ వృత్తాంతం వివరించారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో నడుద్దామని ఆంధ్ర సెంటినరీ చర్చిలో జరిగిన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న వేలాది మందికి దైవ సేవకుడు కె.అగస్టీన్ రాజు వివరించారు. రోమన్ కేథలిక్ చర్చిలో మతగురువు లూకాస్ కల్లకట్ బైబిల్ ప్రవచనాలను తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు, క్రైస్తవ గీతాలాపనలు జరిగాయి. పలు చర్చిల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ చెట్లు, శాంతాక్లాజ్, బాలయేసు జననం సెట్ ఆకట్టుకున్నాయి.

కోటవురట్ల: మండలంలో క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. సంఘస్తులు ఏసుక్రీస్తును ప్రత్యేక ప్రార్థనలతో ఆరాధించారు. క్రీస్తు బోధనలు వినిపించారు. కోటవురట్లలో క్రీస్తు కృపాలయ బాప్టిస్టు(కేకేబీ) చర్చి, రాట్నాలపాలెంలోని బెతస్థా ప్రార్థనా మందిరం, ఎల్‌షద్దాయి ఆరాధనా సంఘాలలో ప్రార్థనలు చేశారు.

పాయకరావుపేట: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని చర్చిలు విద్యుద్దీపాల అలంకరణతో కళకళలాడాయి. చర్చిక్వైర్ టీమ్ సభ్యులు ప్రత్యేక గీతాలు ఆలపించారు. ఆయా చర్చిల వద్ద యూత్ సభ్యులు డాన్స్‌లతో సందడి చేశారు. మండలంలోని అరట్లకోట చర్చిలో జరిగిన వేడుకల్లో ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు మలకా విద్యాసాగర్, రాయి కిషోర్‌బాబు, డేగల ప్రసన్న కుమారి, జాజి, సుధ, సంఘ పెద్దలు యూత్ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కొండకర్ల చర్చిలో గుడివాడ జయకుమార్ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు వస్త్రాలు పంపిణీ చేశారు. రేవడి కృష్ణ, పొన్నమల్ల కొండబాబు, శ్యామల రాజు, కారుకొండి రమేష్ పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో వాడనర్సాపురం గ్రామం సత్యస్వరూపి మినిస్ట్రీస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సందేశాన్ని భక్తులకు పాస్టర్ సుదర్శన్ వినిపించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు కొవిరి రామకృష్ణ, చింతకాయల పెంటయ్య, తదితరుల ఆధ్వర్యంలో గ్రామంలో 150 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

మునగపాక: మండలంలోని గంగాదేవిపేట చర్చిలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జోసెఫ్ కిషోర్, తారకేష్, రాజాన బుజ్జి, మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, పారునాయుడు, సత్తిబాబు, భాస్కరరావు, ఆడారి శ్రీనివాసరావు, ఆడారి లక్ష్మీనారాయణ, నొట్ల నాయుడు, ఇజ్రాయిల్, నహేబి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు ఎస్ఎస్ఎం చర్చిలో క్రైస్తవులకు బొడ్డా సాల్మన్‌రాజు, బ్రదర్ థామస్ పేద్యాదర్ సంయుక్తంగా 100 దుప్పట్లు, నిరుపేద మహిళలకు 100 చీరలు పంపిణీ చేశారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో చర్చి పాస్టర్ డి.విక్టర్‌పాల్‌ను సత్కరించారు. క్రైస్తవులకు ఉపాధ్యాయులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నక్కపల్లి: క్రిస్మస్ సందర్భంగా నక్కపల్లి నెల్లిపూడి, దేవవరం, గొడిచర్ల, వేంపాడు, డీఎల్‌పురం, అమలాపురం, రాజయ్యపేట గ్రామాల్లోని చర్చిల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నక్కపల్లి చర్చిలో జరిగిన కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొని తమ సందేశం వినిపించారు. అనంతరం అన్నదానం చేశారు. క్రైస్తవ పెద్దలు కోరాడ చంద్రరావు, సంఘ కాపరులు పద్మావతి చేసిన బోధనలు ఆకట్టుకున్నాయి.

విద్యుత్ పోరుబాటకు తరలిరావాలి



పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27న మునగపాకలో తలపెట్టిన పోరుబాటకు అందరూ తరలి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పోస్టర్లను ఆయన పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ పథకాలంటూ ఊకదంపుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాక ప్రజలపై పెనుభారాలు మోపుతున్నారన్నారు. విద్యుత్ చార్జీలను పెంచడం ద్వారా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రజారంజకంగా సాగిన విషయాన్ని గుర్తు చేశారు. 27న మునగపాక విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, కోనపల్లి రామ్మోహనరావు, రాజాన బుజ్జిబాబు, శరగడం జగన్నాథరావు, ఆడారి కాశీబాబు, కాండ్రేగుల జగన్, దొడ్డి వరహా, పెంటకోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ముంచేసిన ప్రకృతి



జల్లూరు ప్రాంతంలో వరిచేనులో నిలిచిన నీరు



కైలాసపట్నం ప్రాంతంలో నేలవాలిన వరిచేను

కోటవురట్ల: వాయుగుండం ప్రభావంతో మండలంలో వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతలు కోసిన రైతులు పనలు మడుల్లో ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఆలస్యంగా నాట్లు వేసిన పలు ప్రాంతాలలో వరి చేలు నేల వాలిపోయాయి. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ సీజనులో 4 వేల ఎకరాలలో వరి సాగు జరిగింది. ఆరంభంలో వాతావరణం అనుకూలించడంతో చేలు ఏపుగా పెరిగాయి. మంచి దిగుబడి వస్తుందని ఆశపడ్డ అన్నదాతను సరిగ్గా కోత దశలో వరుస తుపానులు వెంటాడి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. సుమారు 20 రోజులుగా వర్షాలు, సూరీడు దాగుడుమూతలు ఆడుతున్నారు. సూరీడు ఇలా కనిపించగానే హమ్మయ్య అని రైతులు ఊపిరి పీల్చుకునే లోగా మళ్లీ అల్పపీడనంతో వరుణుడు టెన్షన్ పెడుతున్నాడు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జల్లూరు, యండపల్లి, అన్నవరం, తంగేడు, లింగాపురం, కోటవురట్ల, రాజుపేట, కైలాసపట్నం, గొట్టివాడ, రామచంద్రపురం, పాములవాక, నీలిగుంట ప్రాంతాలలో వరిచేలల్లో నీరు నిలిచిపోయింది. చేలు నీట వాలి మునిగిపోకుండా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కాలువలు తీసి నీటిని బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో వరి పనలు ఇంకా మడుల్లోనే ఉన్నాయి. దాంతో అన్నదాతకు నష్టం తప్పేటట్టు లేదు. సుమారు 2 వేల ఎకరాలలో వరి చేలకు నష్టం కలిగే అవకాశం ఉన్నట్టు రైతులు చెబుతున్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలు మరువలేనివి



నక్కపల్లిలో వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో భారతరత్న దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాజపేయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కిషాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, నియోజకవర్గ కన్వీనర్ శ్రీరంగం రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు పోలినాటి నానాజీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మునగపాక: నాగులాపల్లిలో వాజ్‌పేయి చిత్ర పటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు మళ్ల కాళేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్, పార్టీ నేతలు మళ్ల ఉమ, ఆడారి నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మశాస్త్ర కల్యాణం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి పూర్ణ, పుష్కలాంబ సహిత ధర్మశాస్త వారి కల్యాణాన్ని దేవాలయం కోశాధికారి వినకోట నాగకనక పేర్రాజు రాధిక దంపతులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు, కార్యదర్శి ఉప్పల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- దాతల సహకారం.. స్వాముల సంకల్పం
- 15 ఏళ్లుగా అయ్యప్ప మాలధారులకు మధ్యాహ్నం భిక్ష, రాత్రి అల్పాహారం
- యలమంచిలి అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రోజూ 200 మందికి భిక్ష

అన్నదాన ప్రభువే శరణం అయ్యప్ప





అయ్యప స్వామి ఆలయంలో భిక్ష స్వీకరిస్తున్న స్వాములు

యలమంచిలి రూరల్: స్వాములు సంకల్పించారు.. దాతలు సహకరిస్తున్నారు.. వెరసి ప్రతి రోజూ ఎంతో మంది అయ్యప్ప మాలధారులకు మధ్యాహ్నం భిక్ష, రాత్రి వేళ అల్పాహారం అందుతోంది. ఏటా దసరా మరుసటి రోజు నుంచి మకర సంక్రాంతి వరకు అయ్యప్పస్వామి భక్తులు మండల దీక్ష చేపడతారు. 41 రోజుల పాటు ఎంతో నియమ నిష్ఠలతో దీక్షను కొనసాగించే స్వాములకు యలమంచిలి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ ఈ సేవా కార్యక్రమం చేపడుతున్నారు. 2009 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 15 ఏళ్లుగా కొనసాగుతోంది. ఆలయ ధర్మకర్త, ప్రధాన గురుస్వామి మంచిరాజు గణేశ్వర్రావు ఆధ్వర్యంలో మొదట్లో ముగ్గురితో ప్రారంభమైన భిక్ష సదుపాయం ఇప్పుడు దాదాపుగా 200 మందికి చేరుకుంది. ఇంటి వద్ద సౌకర్యం లేనివారు, వివిధ పనులపై చుట్టుపక్కల ప్రాంతాల నుంచి యలమంచిలి పట్టణానికి వచ్చేవారు, ఇలా ఎవరొచ్చినా స్వాములకు ఇక్కడ భిక్ష దొరుకుతుందన్న నమ్మకాన్ని కల్పించారు. అంచనాకు మించి వచ్చినా లేదనకుండా అప్పటికప్పుడు అన్నప్రసాదం వండి పెట్టేలా ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆలయంలో నిత్యాన్నదానంతో పాటు పూజలు, భజనలు, హారతులు కొనసాగుతున్నాయి.

ఏటా నిర్వహణ

ఈ ఏడాది అక్టోబరు 13న ఈ అన్నదాన కార్యక్రమాన్ని అయ్యప్ప ఆలయంలో ప్రారంభించారు. జనవరి 8వ తేదీ వరకు నిర్విరామంగా దీనిని కొనసాగించనున్నారు. భిక్షకు సంబంధించిన ఆహార పదార్థాలను వండి పెట్టడానికి ఆలయ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నం, రెండు కూరలు, పప్పు, చారు, సాంబారు, ఏదైనా పచ్చడితో భిక్షను అందిస్తున్నారు. ఆహార పదార్థాల తయారీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉల్లి, వెల్లుల్లి, గరం మసాలాలు వినియోగించరు. బియ్యం, కూరగాయలతో పాటు సరకుల కొనుగోలుకు ఆలయంలో పూజలకు వచ్చే స్వాముల్లో కొందరు, స్థానికంగా ఉన్న వ్యాపారులు, ప్రముఖులు, ఇతర దాతలు సహాయ సహకారాలు అందజేస్తున్నారు. రాత్రి వేళల్లో రోజుకో రకం అల్పాహారం అందజేసేలా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

ఎంత మందికైనా భిక్ష, అల్పాహారం



ఎంత మంది స్వాములు వచ్చినా లేదనకుండా మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భిక్ష, అల్పాహారం అందిస్తున్నాం. తెల్లవారుజామునే స్నానమాచరించి, పూజలు చేస్తాం. వివిధ వ్యాపార పనులు, ఉద్యోగాల నిమిత్తం పట్టణానికి వచ్చే స్వాములు మధ్యాహ్నం ఆలయానికి వచ్చి పూజలో పాల్గొని, హారతి తీసుకుని భిక్ష తీసుకుంటున్నారు. నిత్యం 200 మందికి పైగా ఇక్కడ భిక్ష స్వీకరిస్తున్నారు. స్వాములు, స్థానికంగా కొంత మంది ఈ బృహత్తర కార్యానికి సహాయ సహకారాలు అందజేస్తున్నారు.

– మంచిరాజు గణేశ్వర్రావు, గురుస్వామి

చాలా గొప్ప సంకల్పం



ఆలయ కమిటీ సంకల్పం గొప్పది. రోజూ భిక్ష, అల్పాహారం అందించడానికి అవసరమైన వంట చేయడంలో నాకు కూడా అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడానికి స్వాములు అందజేస్తున్న సహకారం కూడా గొప్ప విషయం. వివిధ ప్రాంతాల నుంచి పనుల మీద వచ్చే మాలధారులు అయ్యప్ప ఆలయంలో భిక్ష కచ్చితంగా దొరుకుతుందన్న నమ్మకంతో వస్తున్నారు. మా వద్ద భిక్ష స్వీకరించడం దేవుని కృపగా భావిస్తున్నాం.

– కె.శ్రీనివాసరెడ్డి, గురుస్వామి

పదేళ్లుగా భిక్ష తీసుకుంటున్నా..



అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి గణేష్ ఆధ్వర్యంలో స్వాములకు నిత్యం భిక్ష, అల్పాహారం సమకూర్చే కార్యక్రమం నిరాటంకంగా సాగుతోంది. సుమారు 10 ఏళ్లుగా ప్రతి ఏటా మాలధారణ సమయంలో ఇక్కడే భిక్ష తీసుకుంటున్నాను. స్వాములకు వండి పెట్టే ఆహార పదార్థాల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి ఏటా ఇక్కడకొచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఇళ్ల వద్ద పూజలు, వంటలు నియమం ప్రకారం చేయడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ఆలయంలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటున్నాయి.

– చెక్కా శ్యామ్, అయ్యప్ప మాలధారుడు

శాస్త్రోక్తంగా సుదర్శన నృసింహ యాగం



తిమ్మరాజుపేట వెంకన్న ఆలయ ప్రాంగణంలో సుదర్శన నృసింహ యాగంలో పాల్గొన్న భక్తులు

మునగపాక: తిమ్మరాజుపేటలో నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన శ్రీసుదర్శన నృసింహ యాగం శాస్త్రోక్తంగా జరిగింది. వేద పండితుడు సుమంత్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖకు చెందిన టీటీడీ క్లస్టర్ సూపరింటెండెంట్ ఎం.శాంతికుమార్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీహెచ్.సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ హోమం చేశారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కో-ఆర్డినేటర్ కాండ్రేగుల వెంకటప్పారావు, ట్రస్ట్ చైర్మన్ శరగడం రామేశ్వరరావు, డుమా పీడీ శరగడం తారక వెంకట రాజేశ్వరరావు, వాసుబాబు, హరిబాబు, అబ్బాయినాయుడు, కన్నం నాయుడు, సింహాద్రినాయుడు, బాపునాయుడు, కాండ్రేగుల గణేష్, వెంకట్రావు పాల్గొన్నారు.